క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


గాయత్రీ మాత

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు.

సర్వేలు వేగవంతం చేయాలి

ఆలూరు రూరల్: అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలు వేగంగా పూర్తి చేయాలని చిప్పగిరి ఎంపీడీఓ అల్లబకష్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం చిప్పగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో 9 సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..చిప్పగిరి మండలం ఆస్పిరేషన్ బ్లాక్ కింద ఎంపికైనందున సూక్ష్మ పరిశ్రమల సర్వే, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీ వంటి సర్వేల్లో కొన్ని సచివాలయాల సిబ్బంది వెనుకబడి ఉన్నారని.. అలసత్వం వీడి పనిచేయాలని ఆదేశించారు. ఈ నెల 15వ తేదీలోపు అన్ని గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈఓపీఆర్డీ బాలన్న ఉన్నారు.

దేవమ్మవ్వ విగ్రహం ఊరేగింపు

ఆలూరు: స్థానిక కోటవీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ దేవమ్మవ్వ విగ్రహాన్ని ఈ నెల10వ తేదీన ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఉపాధ్యాయనగర్‌లో కొలు వుదీరిన సాయిబాబు మందిరం నుంచి మెయిన్ బజారు, శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపు సాగింది.

కోలుకోలేక వ్యక్తి మృతి

కృష్ణగిరి: మండలంలోని తొగర్చేడు గ్రామానికి చెందిన కొంకి గిడ్డయ్య (46) ఈ నెల 4న రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఈ నెల 4న మృతుడు తన భార్య గిడ్డమ్మతో కలిసి బైక్‌పై కొత్తూరు సమీపంలోని తన వరి పొలానికి నీరు పెట్టడానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గొల్ల శివ బైక్‌ను అతివేగంగా నడుపుకుంటూ వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో గిడ్డయ్యకు బలమైన గాయాలు కావడంతో వెల్దుర్తిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య గిడ్డమ్మ ఫిర్యాదు మేరకు గొల్ల శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు


ముక్కెళ్లలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని ముక్కెళ్లలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయంలో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. అనంతరం ఆలయం ముందు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇంటి ఆడ పడుచులు ఒడి బియ్యం పోసుకుని ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. రాత్రి చెక్క భజన కార్యక్రమం నిర్వహించారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీ

తుగ్గలి : స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలను దోచుకునేందుకు కూటమి పాలకులు సిద్ధమయ్యారని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు విమర్శించారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ప్రజలతో కలిసి శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. త్వరలో నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు చర్యలు ప్రారంభించిందని ప్రజలంతా వ్యతి రేకించాలని కోరారు.

హొళగుందలో షూటింగ్ సందడి


సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో చిత్రబృందం

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం షూటింగ్ సందడి నెలకొంది. సినీ నిర్మాతగా మారిన గ్రామానికి చెందిన తోక వెంకటేష్.. డైరెక్టర్ అజయ్ సూర్యతో కలిపి తీయబోయే సినిమా కార్యక్రమాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నటీ నటులు ఐశ్వర్య, తిరుతో పాటు మేనేజర్ ఖాదర్ బాషా, హుసేన్, చిత్ర యూనిట్ సభ్యులు హాజరయ్యారు. డైరెక్టర్ మాట్లాడుతూ 1995లో జరిగిన వాస్తవ ఘటనను దృష్టిలో ఉంచుకుని చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

- పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇక్కట్లు
- రోడ్లపైనే మురుగు నీటి ప్రవాహం
- దుర్గంధం వెదజల్లుతున్న కాలనీలు
- విజృంభిస్తున్న దోమలు



ఇది ఏ మారుమూల గ్రామమో కాదండీ..మండల కేంద్రం దేవనకొండలోని ఎస్సీ కాలనీ.. ఇక్కడ వర్షం కురవనప్పటికీ ఈ బురద ఏంటి అనుకుంటున్నారా? కాలనీలో మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు ఇలా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో కనీసం నడవడానికి కూడా వీలు లేనట్లుగా మారింది. చర్యలు తీసుకోవాలని పలుమార్లు స్థానికులు కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



ఇది దేవనకొండ మండలంలోని బేతపల్లి గ్రామ ముఖద్వారం.. గ్రామంలోకి అడుగుపెట్టాలని ఇలాంటి మురుగు గుంతలు చాలానే దాటాలి. ఊరిబయటే కాదండీ.. ఊర్లోనూ ఇదే పరిస్థితి. డ్రైనేజీ వ్యవస్థ గురించి పట్టించుకోకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ఇక గుంతలు పడిన చోట నిల్వ చేరి దుర్గంధం వెదజల్లడమే కాకుండా దోమలు, పందులకు ఆవాసంగా మారుతున్నాయి. పరిష్కారం చూపండని గ్రామస్తులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది.



ఇది దేవనకొండ బస్టాండ్ సమీపంలో పేరుకుపోయిన చెత్త. మండలస్థాయి అధికారుల కేంద్రం, నిత్యం జిల్లా స్థాయి అధికారులు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ గ్రామ పరిసరాలు ప్రారంభం కాగానే చెత్తకుప్పలు స్వాగతం పలుకుతాయి. గ్రామ సరిహద్దు ముగిసే వరకు ఇలా పేరుకు పోయిన చెత్త దర్శనమిస్తుంది. పరిశుభ్రత, పారిశుద్ధ్యం గురించి సూక్తులు వల్లించే అధికారులు చెత్తను మాత్రం శుభ్రం చేయించలేక పోతుండటాన్ని చూస్తే.. పల్లెల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

కంపు..కంపు!

ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. నియోజకవర్గంలోని ఏ గ్రామంలో చూసినా పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. పల్లెల్లో రోడ్లపై నడవలేనట్లుగా మురుగునీటి ప్రవాహం ఉంటుండటం, దోమల బెడద తీవ్రంగా ఉంది.. నివారణ చర్యలు తీసుకోండని చెబుతున్నప్పటికీ వారి గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. జెడ్పీ నిధులు, మండల నిధులు, పంచాయతీ నిధులు, ఎంపీ నిధులు ఇలా పలురకాల నిధులు విడుదలైనప్పటికీ గ్రామ ముఖ చిత్రాలు మారడం లేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా తయారైంది పల్లెల పరిస్థితి.

దేవనకొండ: పల్లెల్లో పారిశుద్ధ్యం పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వివిధ రకాల నిధులతో పేరుతో పనులు చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం జనం అవస్థలతో సహజీవనం కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో కనీస వసతులు కరువయ్యాయి.

గ్రామాల్లో వెళ్తే చెత్త కుప్పలు స్వాగతం పలుకుతాయి. ఇక ఎక్కడ చూసినా కుప్పలు కుప్పలుగా చెత్త కనిపిస్తుంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లు, వీధుల్లో ప్రవహిస్తుంది. ఇక దోమలు, పందుల బెడద తీవ్రంగా ఉంది.

సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక..

మండలంలోని చాలా గ్రామాల్లో సరైన సీసీ రోడ్లు లేకపోవడం, మురుగు కాలువ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్య నిలిచి దోమల బెడద ఎక్కువై ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా వర్షపునీరు వెళ్లేందుకు సరైన కాలువ వ్యవస్థ లేక ఇళ్ల మధ్యనే నిలుస్తున్నాయి. వైద్య, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులతో కలిసి ప్రతి శుక్రవారం పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు ఫోటోలకు ఫోజులిచ్చి పోతున్నారనే విమర్శలున్నాయి. దీంతో సమస్యలు కొనసాగుతున్నాయి.

సమస్యల్లో కొన్ని..

- మండలంలోని నేలతలమరి గ్రామంలోని పాఠశాలలో 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో సరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్కూలు చుట్టుపక్కల మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- దేవనకొండ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు లేక మురుగునీరు ఇళ్ల మధ్యనే ప్రవహిస్తుండడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు.
- బేతపల్లి గ్రామంలో ఊరి ద్వారం వద్ద సరైన రోడ్డు వ్యవస్థ, మురుగు కాలువ వ్యవస్థ లేక రోడ్డుపై మరుగు నీరు పారుతోంది.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతివాడలా సీసీ రోడ్లు నిర్మించి, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, ప్రతిరోజూ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నేలతలమరిలో పాఠశాల వెనకవైపు నిలిచిన మురుగునీరు

కాలనీలో ఉండాలంటే భయమేస్తోంది



దేవనకొండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్నాం. మా కాలనీలో సరైన మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేవు. దీంతో చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. కాలాలకు అతీతంగా బురదతోనే నిండి ఉంటుంది. కనీసం ఆ రోడ్డుపై నడవలేం. ఇళ్లల్లోని నీరంతా రోడ్లపైకి వస్తుంది. దీంతో దోమలువ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కాలనీలో ఉండాలంటే భయమేస్తోంది.

– హంపయ్య, దేవనకొండ గ్రామం

వాసన భరించలేక పోతున్నాం



గ్రామంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వీధుల్లో ఉన్న మురుగునీరంతా పాఠశాల పరిసర ప్రాంతంలో పారుతోంది. భరించలేని దుర్గంధంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరాం. ఎవరూ పట్టించుకోలేదు.

– వెంకమ్మ, నేలతలమరి గ్రామం

వైభవం.. భద్రకాళి, వీరభద్రస్వామి రథోత్సవం


హోసూరులో కల్యాణం జరిపిస్తున్న పండితులు,


అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవం

పత్తికొండ రూరల్ : మండలంలోని హోసూరు గ్రామంలో భద్రకాళి, వీరభద్రస్వామి రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం గ్రామంలోని ఆలయంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో గ్రామం కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో సీఐ జయన్న, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి


మద్దికెరలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

మద్దికెర : మండలంలోని బురుజుల గ్రామంలో శ్మశానం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థలం కేటాయించాలని ఆర్డీఓ భరత్‌నాయక్‌కు గ్రామస్తుడు మోహన్ విన్నవించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. శ్మశానానికి సంబంధించిన రికార్డులు ఆర్డీఓ కార్యాలయానికి తీసుకురావాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రైతుల భూసమస్యలను సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. పాస్‌బుక్ మంజూరు చేసేటప్పుడు అందుకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, వీఆర్వోలు రషీద్, రామాంజనేయులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందించాలి

తుగ్గలి : రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆర్డీవో భరత్‌నాయక్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు, మ్యూటేషన్లు, రీ సర్వేపై సమీక్ష చేసి పలు సూచనలు చేశారు. పొరపాట్లు జరిగినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

10 నుంచి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, వైద్యులు

హాలహర్వి: ఈనెల 10వ తేదీ నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల (ఆల్బెండజోల్)ను అందిస్తున్నట్లు హర్దగేరి వైద్యాధికారి గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. వైద్యాధికారి గంగాధర్, పీహెచ్ఎన్ పద్మలలిత, సూపర్‌వైజర్ చిట్టి, ఏఎన్ఎంలు ఆలివేలు పాల్గొన్నారు.

వెల్దుర్తి: ఈనెల 10వ తేదీ జరుగబోయే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం ఎంపీడీఓ సుహాసిని ఆవిష్కరించారు. గోవర్ధనగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఇప్పటికే సరఫరా చేసిన ఆల్బెండజోల్ మాత్రలను అంగన్‌వాడీ, పాఠశాలల్లో పిల్లలకు, విద్యార్థులకు తప్పకుండా అందించేలా చూడాలన్నారు. వైద్యులు ఎస్ శ్రీధర్ రెడ్డి, నవీన్‌కుమార్, సూపర్‌వైజర్ నాగలక్ష్మ, 104 హెల్త్ అసిస్టెంట్ నాగన్న పాల్గొన్నారు.


ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

కృష్ణగిరి: ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వైద్య అధికారులతో కలిసి పోస్టర్‌ను అవిష్కరించారు.

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం


దేవనకొండ: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభిస్తామని వైద్యాధికారులు విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

హోరాహోరీగా అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు


తలపడుతున్న క్రీడాకారులు

హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సిద్ధేశ్వరస్వామి వేడుకల్లో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో దాదాపు 50 జట్ల వరకు పాల్గొననున్నాయి. మొదటి రోజు పది జట్ల మధ్య పోటీ హోరాహోరీగా జరిగింది.

టేకు, శ్రీగంధం చెట్లు దగ్ధం


మంటలను ఆర్పుతున్న రైతులు

కృష్ణగిరి: చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన బండారు మద్దిలేటి పొలంలో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని విలువైన చెట్లు దగ్ధమయ్యాయి. తన ఐదెకరాల్లో సాగు చేసిన శ్రీగంధం, టేకు, మహాగణి, ఎర్రచందం చెట్లు దాదాపు ఏడు వందలకు పైగా, రెండు స్టార్టర్లు, డ్రిప్ వైర్లు కాలిపోయినట్లు తెలిపారు.

● దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

తుగ్గలి : బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ శుక్రవారం తెలిపారు. గత నెల 30వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● 10న ఉచిత వైద్యశిబిరం

మద్దికెర : ఈనెల 10వ తేదీన స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ ఆవరణలో ఉచిత గుండె, కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్, ఆపద్బంధు సేవా సమితి అధ్యక్షుడు సునీల్ శుక్రవారం తెలిపారు. అనంతపురం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేస్తారని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● 15 లోపు ఈ–కేవైసీ చేయించాలి

మద్దికెర : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీ లోపు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఏఓ రవి శుక్రవారం సూచించారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించి పాస్‌బుక్, ఆధార్ కార్డు, 1బీ జిరాక్స్ ప్రతులను అందించాలని సూచించారు. ఈ–కేవైసీ చేయించడం వల్ల రైతులకు ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారం, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు వంటి ప్రయోజనాలు పొందేందుకు అర్హులవుతారని చెప్పారు.

● నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి : మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్దికెర : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అహమ్మద్ రఫీక్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు, లక్కసాగరం సబ్‌స్టేషన్ల కింద శనివారం వ్యవసాయానికి అందించే విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు ట్రాన్స్‌కో ఈఈ శేషాద్రి, ఏఈ మద్దిలేటి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్లలో మర్మమతులు కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. దీంతో వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 10 గంటలకు వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్ర 6 గంటల వరకు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

● 10న దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని అట్టెకల్లు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి 33వ ఉరుసు ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. 10న గంధం, 11న ఉరుసు, 12న జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

● రుణాలకు దరఖాస్తు చేసుకోండి

దేవనకొండ: బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువుందన్నారు. వివరాలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

● వంద పని దినాలు కల్పించాలి

ఆలూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న కూలీలందరికీ వంద రోజుల పని దినాలు కల్పించాలని ఎంపీడీఓ మహబూబ్ బాషా ఉపాధి సిబ్బందికి సూచించారు. రోజ్‌గార్ దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని హత్తిబెళగల్ గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడారు. చేసిన పనికి కొలతల ప్రకారం లెక్కించి రోజుకు రూ. 300 కూలీ అందేలా చూడాలన్నారు. అలాగే పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని కూలీల మస్టర్‌లను పని ప్రదేశం నుంచి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

● ఉరుసు ప్రారంభం

కృష్ణగిరి: అలంకొండ గ్రామ శివారులోని కొండపై వెలసిన దస్తగిరయ్యస్వామి ఉరుసును శుక్రవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు నాగదేవత పూజ, 9:30 గంటలకు అభయ అంజనేయస్వామి పూజ, 10గంటలకు పోతప్ప పూజలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. శనివారం తెల్లవారుజామున గంధోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వేడుకగా సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి


వలంటీర్లుగా సేవలందించేందుకు వచ్చిన విద్యార్థినులు

హొళగుంద: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాలతో పాటు మండల ప్రజల ఆరాధ్య దేవుడైన శ్రీసిద్ధేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి రమణీయంగా సాగింది. అంతకు ముందు ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకీలో కొలువుంచి ఎదురు బసవన్నగుడి చుట్టూ ప్రదక్షిణ చేయించారు. కొందరు భక్తులు ఆచారం ప్రకారం కుంభంతో రాగా, మరి కొందరు ట్రాక్టర్‌లో గజమాలలను తెచ్చి రథానికి వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విగ్రహాలను రథంపై అధిష్ఠింపజేసి తేరువీధిలో అశేష భక్త జనుల జయజయ ధ్వానుల మధ్య రథాన్ని ముందుకు లాగారు. వేడుకను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలూరు సీఐ వెంకటచలపతి నేతృత్వంలో హొళగుంద, హాలహర్వి, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి తదితర మండలాల ఎస్ఐలు బాల నరసింహులు, సతీష్‌కుమార్, చంద్ర, దిలీప్‌కుమార్‌తో పాటు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. జాతర సందర్భంగా స్థానికులు ప్రదర్శించిన వీరాభిమన్యు కాళగ అనే బయలు కన్నడ నాటిక అలరించింది.

ప్రత్యేక పూజలు

మండల కేంద్రంలో వెలిసిన సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం రథోత్సవం, శనివారం లంకాదహనం, ఆదివారం వసంతోత్సవం కార్యక్రమాలు జరగనుండగా శుక్రవారం ఉదయం ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం, ఆకుపూజ, రుద్రాభిషేకం, నైవేద్యం సమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.


రథోత్సవానికి ముందు కుంభంతో వస్తున్న భక్తులు

●నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన అనాథ వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఆదోని వివేకనంద సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్ భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టారు.

●మోసగించడమే చంద్రబాబునాయుడి నైజం

దేవనకొండ: మాటల గారడీతో ప్రజలను మోసగించడమే సీఎం చంద్రబాబునాయుడి నైజమని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి కుమారుడు చంద్రశేఖర్, దేవనకొండ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం మండలంలోని సింగాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సాధ్యంకాని హామీలను గుప్పించి ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలను వేధిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, వారికి సరైన సమయంలో సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

●ఆలయ నిర్మాణానికి భూమి పూజ

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో శరణ రామలింగయ్యస్వామి తాత ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. శ్రీ నాగలింగయ్యతాత, శ్రీ ప్రభులింగయ్యతాతతో కలిసి కర్ణాటక భక్తులు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, గంగపూజ, ఉమామహేశ్వర పూజ తదితర పూజలు జరిపించారు.

●ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఆలూరు రూరల్ : ప్రభుత్వ శాఖల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్స్ ఔట్ సోర్సింగ్ వార్డెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీల ద్వారా నియామకాలు చేపడితే పారదర్శకత లోపించి, మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు.

బినామీ మస్టర్లకు చెక్

- ఎన్ఈఎంఎస్ హాజరు తప్పనిసరి చేసిన కేంద్రం


ఆలూరు సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆలూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బినామీ మస్టర్లకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం హాజరు నిబంధనలను కఠినతరం చేసింది. ఎన్ఈఎంఎస్ (నేషనల్ ఎలక్ట్రానిక్ మస్టర్ షీట్) లో ప్రతి రోజు పని చేసే చోట ఫొటో తీసి ఎన్ఈఎంఎస్ ఆన్‌లైన్‌లో హాజరు వేయాలి. కొందరు ఉపాధి సిబ్బంది సెల్‌ఫోన్ పనిచేయడం లేదని, సర్వర్ సమస్య ఉందని కూలీల హాజరును వేసేవారు కాదు. దీంతో బినామీ మస్టర్లకు అవకాశం ఉండేది. ఇకపై ఎన్ఈఎంఎస్‌లో హాజరు వేసిన వారికి మాత్రమే వేతనాలు చెల్లిస్తారు. మండలంలో 8,015 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో రోజూ 1,250 నుంచి 1,300 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వీరందరికీ ఎన్ఈఎంఎస్‌లోనే హాజరు వేయాలని, సాధారణ పద్ధతిలో వేస్తే పరిగణలోకి తీసుకోమని ఆలూరు ఏపీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు.